
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 26.0
కనిష్ఠం 16.2

ANDHRAJYOTHY



సూర్యాపేట

5

బుధవారం 3 డిసెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	579.70 (282.1472)	44,006	44,006
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.58 (4.35)	879.08	260.19
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.390 (43.3045)	640.62	702.43

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.240

పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడతలో నామినేషన్ల ఉపసంహరణకు నేటితో గడువు ముగియనుంది. ఒక్కో సర్పంచ్, వార్డు స్థానాలకు పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. పోరులో నిలిచేదెవరో, తొలగేదెవరో నేడు తేల నుంది. సాయంత్రం మూడు గంటల అనంతరం అభ్యర్థులకు అధికారులకు గుర్తులు కేటాయిస్తారు. ఆలోగా ప్రత్యర్థులను రంగం నుంచి తప్పించేందుకు బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. నయానో, భయానో వారిని ఒప్పించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

బుజ్జగింపులు బేరసారాలు

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట (కలెక్టరేట్)



- నేటితో ఉపసంహరణకు గడువు పూర్తి
- సాయంత్రం మూడు గంటల తర్వాత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ కొందరికి
- డబ్బుల ఆశపెట్టి మరికొందరితో ఉపసంహరణ

పంచాయతీ ఎన్నికల్లో వివిధ పార్టీల నుంచి పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. అయితే పార్టీలతో సంబంధం లేకుండా పలువురు సర్పంచ్, వార్డు స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. వీరిని పోటీ నుంచి తప్పించేందుకు పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ఇతర సీనియర్ నాయకులు, పార్టీ ముఖ్యుల ఆధ్వర్యంలో బుజ్జగింపులు ప్రారంభించారు. అధికార పార్టీ నాయకులు మాత్రం నామినేషన్ ఉపసంహరించుకుంటే జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యమిస్తామని నచ్చజెబుతున్నట్లు సమాచారం. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పోటీ అధికంగా ఉంది. అయితే వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలిస్తే అవకాశాలు ఇస్తామని నచ్చజెబుతున్నట్లు తెలుస్తోంది.

ఎవరికీ మనసుకు తగ్గట్టు...

సర్పంచ్, వార్డుమెంబర్ల స్థానాలకు నామినేషన్ దాఖలు చేసిన వారిలో కొందరు కేవలం డబ్బుల కోసం నామినేషన్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. నామినేషన్ ఉపసంహరణకు డబ్బులు ఇవ్వాలని, లేదంటే పోటీలో ఉంటామని స్పష్టం చేస్తున్నారు. చేసేది లేక గ్రామాల్లో వారికి ఉన్న జనబలాన్ని బేరీజు వేసుకుని ఎంతో కొంత డబ్బు ఇచ్చి ఉపసంహరణ చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరిని మాత్రం సామాజిక వర్గాల వారీగా ఎవరు చెబితే వింటారో వారి ద్వారా ఉపసంహరణకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే అదునుగా కొందరు వారి సెల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకుండా ఉంటున్నారు.

అన్నీ వివరిస్తూ...

రాజకీయాల్లో ఉంటూ పంచాయతీల్లో స్థానం సంపాదించాలని తపిస్తున్నప్పటికీ కొందరికి సామాజిక, ఆర్థిక బలం ఉండటం లేదు. అయినప్పటికీ వారు నామినేషన్ దాఖలు చేశారు. వారిని పార్టీ నుంచి ఎంపికైన అభ్యర్థులు విరమించుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. విజయం సాధించాలంటే పార్టీ మద్దతుతో పాటు డబ్బు ఉండాల్సిన అవసరాన్ని, సామాజిక పరిస్థితులను వివరిస్తున్నారు. గ్రామంలో ఏవర్గానికి ఎక్కువ ఓట్లు ఉన్నాయో...

- మిగతా 8వ పేజీలో...

జిల్లా అంతటా కోలాహలం

- రెండో విడతలో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- నేటి నుంచి మూడ విడతలో ప్రారంభం
- ముగిసిన మొదటి విడత చోట్ల అభ్యంతరాలు
- నేడు ఉపసంహరణకు అవకాశం

నేటి నుంచి జిల్లా అంతటా ఎన్నికల కోలాహలం సంతరించుకోనుంది. మంగళవారం నాటికి మొదటి విడతలో నామినేషన్లపై అభ్యంతరాలకు గడువు ముగియగా, రెండో విడత ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. బుధవారం నుంచి మూడో విడతలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో అన్ని ప్రాంతాల్లో ఎన్నికల సందడి షురూ అయినట్లే. దీంతో ఏ గ్రామంలో చూసినా ఎన్నికల సందడి కనిపిస్తోంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)



పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి, రెండో విడత ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియలు పూర్తయ్యాయి. మొదటి విడతలో నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాలు సైతం పూర్తి కాగా నేడు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మూడు గంటల్లోకి ఉపసంహరించుకున్న వారు పోను మిగిలిన వారిని అభ్యర్థులుగా ప్రకటిస్తారు. ఇదిలా ఉండగా రెండో విడతలో నామినేషన్ల ఘట్టం పూర్తయ్యింది. చివరిరోజు కావడంతో నామినేషన్లు వేసేందుకు ఆశావహులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. అర్ధరాత్రి వరకు నామినేషన్ల తంతు కొనసాగింది. పలు గ్రామాల్లో నామినేషన్ల ప్రకియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రవినాయక్, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, ఎస్పీ కొత్తపల్లి నర్సింహ పరిశీలించారు. ఆయా నామినేషన్లను అధికారులు నేడు పరిశీలించనున్నారు. అదేవిధంగా ఈ నెల 6వ తేదీ సాయంత్రం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు ఉంది. జిల్లాలో రెండో విడతలో ఎనిమిది మండలాలో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు 181 సర్పంచ్ స్థానాలకు 546 నామినేషన్లు, 1,628 వార్డు...

- మిగతా 8వ పేజీలో...

ఆ రెండు చోట్ల మినహా...

- అన్నింటా మహిళా ఓటర్లే అధికం
- తిరుమలగిరి పురుషుల హవా, తుంగతుర్తిలో సమానం
- అన్నిస్థానాల్లో సగభాగం రిజర్వు
- కీలకం కానున్న మహిళా ఓట్లు



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్): పంచాయతీ ఎన్నికల్లో మహిళలు కీలకం కానున్నారు. జిల్లాలో అన్నిచోట్ల గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా మహిళలే ఉన్నారు. దీంతో వారి ఓట్లే విజయానికి ప్రాధాన్యం కానున్నాయి. జిల్లాలోని తిరుమలగిరి, తుంగతుర్తి మండలాలు మినహా అన్ని మండలాల్లో మహిళా ఓటర్లు అధికసంఖ్యలో ఉన్నారు. తిరుమలగిరి మండలంలో 51 మంది పురుషులు ఎక్కువగా ఉన్నారు. అదేవిధంగా తుంగతుర్తి మండలంలో పురుషులు, మహిళాఓటర్లు సమానంగా ఉన్నారు. దీంతో మహిళా ఓట్లు గుంపగుత్తగా ఎటువైపు మొగ్గుచూపితే అటు వైపే విజయావకాశాలు ఉండనున్నాయి.

213 సర్పంచ్ పదవుల్లో...

గ్రామాలు	మహిళలకు	వార్డులు	మహిళలకు
486	213	4,388	1,935
ఓటర్లలో భాగస్వామ్యం			
మొత్తం	పురుషులు	మహిళలు	అత్యధికం
6,94,815	3,40,743	3,54,050	13,307

అన్నిరంగాల్లో దూసుకెళ్తున్న మహిళలు రాజకీయ రంగంలోనూ తమ చాటుతున్నారు. పంచాయతీరాజ్ చట్టం- 2017 ప్రకారం మహిళలకు స్థానిక సంస్థల్లో 50శాతం రిజర్వేషన్లను అమలుచేస్తున్నారు. 2019లో అమలైన ఈ రిజర్వేషన్లు, ప్రస్తుత ఎన్నికల్లోనూ కొనసాగిస్తున్నారు. దీంతో మొత్తం ప్రజాప్రతినిధుల్లో సగం మంది మహిళలే ఉండనున్నారు. సూర్యాపేట జిల్లాలో 486 గ్రామపంచాయతీలకు 213 చోట్ల, 4,388 వార్డుల్లో 1,935 వార్డులను మహిళలకు కేటాయించారు. మిగతా వీటిలో సామాజిక రిజర్వేషన్లపరంగా మహిళలే పోటీ చేయాల్సి ఉంటుంది.

170 సమస్యాత్మకం

ఎన్నికల వేళ సున్నిత ప్రాంతాలుగా గుర్తింపు



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట క్రైం): జిల్లాలో పంచాయతీ ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకం గా తీసుకుంటున్నాయి. ఇన్నాళ్లు ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తూ సర్పం చ్, వార్డు పదవుల్లో గెలిచేందుకు నాయకులు విస్తృత ప్రయత్నాలు చేశారు. ప్రస్తుతం నామినేషన్లు, ఉపసంహరణ అన్ని ప్రక్రియలు కొనసాగుతున్న నేపథ్యంలో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎక్కడ చూసినా ఎన్నికల సందడి నెలకొంది. కొద్ది ఓట్లతోనే విజయావకాశా లు చేజారే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఘర్షణలు చోటుచేసుకునే అవకాశాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో అలాంటి గ్రామాలను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గతంలో ఘర్షణలో భాగస్వాములను ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 122 కేసుల్లో 291 మందిని బైండోవర్ చేశారు. అదేవిధంగా లైసెన్స్ కలిగిన 31 ఆయుధాలను డిపాజిట్ చేయించారు.

ప్రతీ గ్రామం కీలకమే...

అభ్యర్థులు విజయం కోసం డబ్బు, మద్యం పెద్దఎత్తున పంపిణీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. అందుకోసం ఆయా పార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల్లో ప్రతీ గ్రామాన్ని పార్టీలు కీలకంగా చూస్తున్నాయి. అధికార పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు ఎక్కువ స్థానాలు గెలుచుకోవాలని వ్యూహాల్లో ఉంటే ప్రతిపక్ష పార్టీలు తమ బలాన్ని నిరూపించుకోవాలని చూస్తుంటాయి. ఇలాంటి తరుణంలోనే ఎవరికి వారు పట్టు సాధించేందుకు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుంటారు. ఈ తరుణంలో వారిని అడ్డుకునేందుకు సిద్ధమవుతుంటారు. ఈ పరిస్థితుల్లోనే గ్రామాలల్లో ఘర్షణలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పెద్దఎత్తున ఘర్షణలు జరిగాయి. కొంతమంది హత్యకు గురయ్యారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల సమయం వచ్చిందంటే సమస్యాత్మక గ్రామాల్లోని ప్రజలు ఒకింత భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ సమయంలో ఏ గొడవ జరుగుతుందోనని వారు భావిస్తున్నారు.

ముందస్తు చర్యలు

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ప్రశాంతంగా కనిపిస్తున్నా గతానుభవాల దృష్ట్యా ఇది నివురుగప్పిన నిప్పులాంటిదని పేర్కొంటున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో 170 సమస్యాత్మక గ్రామాలుఉన్నట్లు గుర్తించారు. మొదటి విడత ప్రాంతాల్లో 159 గ్రామాల్లో 47, రెండోవిడతలో 181 గ్రామాల్లో 65, మూడోవిడతలో 146గ్రామాల్లో 58 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లో బందోబస్తును పటిష్టం చేయనున్నారు. ఎప్పటికప్పుడు కొంతమంది స్థానికులతో గ్రామ పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఎస్పీ నర్సింహతో పాటు స్థానిక పోలీస్ అధికారులు పర్యటిస్తూ ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి ముందస్తుగా వారితో రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు పూచీకత్తు చేయిస్తున్నారు. పోలీస్ కళాజాత బృందాల చేత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే సమస్యాత్మక గ్రామాలను గుర్తించాం. గతంలో ఘర్షణలు జరిగిన ప్రాంతాలను పరిశీలించాం. పలువురిని బైండోవర్ చేశాం. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిపై వేటు

ఎమ్మెల్యేకు తెలియకుండానే సర్పంచ్ అభ్యర్థుల జాబితా వెల్లడి

అర్వపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాజిరెడ్డిగూడెం మండల అధ్యక్షుడు మోరపాక సత్యంను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్యం తనకు ఎలాంటి సమాచారం తెలపకుండా, నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగియకముందే జాజిరెడ్డిగూడెం మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌ల జాబితాను ప్రకటించారని వెల్లడించారు. సత్యంకు జాబితా ప్రకటించే అధికారం లేదని, ఆయన ప్రకటించిన జాబితా చెల్లదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలకు నష్టం కలిగించేలా ప్రవర్తించినందున సత్యంను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు తెలియజేసి మోరపాక సత్యంను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. సత్యం వెనకాల ఉన్న వారిపై కూడా త్వరలో పార్టీపరమైన క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పోటీ చేయబోయే సర్పంచ్ అభ్యర్థులు గమనించి ప్రవర్తించాలని తెలిపారు.


లౌకిక శక్తులతో కలిసి ముందుకు సాగుతాం



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో లౌకిక శక్తులతో కలిసి ముందుకు సాగుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి వెల్లడించారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి విడతలో సర్పంచ్, వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశామన్నారు. జిల్లాలోని అనేకచోట్ల కాంగ్రెస్‌తో, కొన్నిచోట్ల ప్రజాతంత్ర శక్తులతో కలిసి పోటీ చేస్తున్నామన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులనే ఎన్నుకోవాలన్నారు. సీపీఎం మద్దతు అభ్యర్థులను గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా_కార్యదర్శివర్గ సభ్యుడు నాగారపు పాండు, పల్లె వెంకటరెడ్డి, పాండు నాయక్, దుగ్గి బ్రహ్మం, పోసనబోయిన హుస్సేన్, బాలునాయక్ పాల్గొన్నారు.

విధుల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలి



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానికసంస్థల ఎన్నికల విధుల్లో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. మంగళవారం పట్టణంలోని విజయవిద్యామందిర్ స్కూల్‌లో సర్పంచ్ ఎన్నికలల్లో విధులు నిర్వహించే పీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు సకాలంలో హాజరు కావాలన్నారు. ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటుచేశామని, రూట్‌మ్యాప్‌లు రూపొందించామన్నారు. డివిజన్‌లోని 7 మండలాల్లో పోలింగ్ ఆఫీసర్లను నియమించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమంత్‌రెడ్డి, ఎంఈవో సైదానాయక్, తహసీల్దార్ బండా కవిత, రామిశెట్టి శ్రీనివాస్, అమరవాది అశోక్‌కుమార్, శిక్షణ ట్రైనర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియల్లో పొరపాట్లు జరగొద్దు



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్లలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం అనంతగిరి మండల పరిషత్ కార్యాలయాన్ని, అనంతగిరిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అనంతగిరి క్లస్టర్ పరిధిలోని అనంతగిరి, కిష్టాపురం, అమీనాబాద్ పరిధిలోని ఎన్నికల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా నామినేషన్ వేయడానికి అభ్యర్థులు క్యూలో ఉంటే వారికి వెంటనే టోకెన్లు జారీ చేసి నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. అనంతగిరి ఎంపీడీవో కార్యాలయంలో ఆన్‌లైన్ నామినేషన్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. నామినేషన్లు స్వీకరించిన వెంటనే తప్పులు దొర్లకుండా వివరాలను టీపోల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్లు హిమబిందు, వాజిద్ అలీ, ఎంపీడీవోలు హరిసింగ్, ఇజాక్ హుస్సేన్, ఎంపీవో సుష్మ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

టీ-పోల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదుచేయాలి

మునగాల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : టీ-పోల్ యాప్‌లో నామినేషన్ వివరాలను సంక్షిప్తంగా నమోదు చేయాలని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఆకుపాముల పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించి, మాట్లాడారు. అన్ని నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు సందేహాలు ఉంటే అధికారుల ద్వారా తెలుసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, జడ్పీ డిప్యూటీ సీఈవో శిరీష, ఎంపీవో నరేష్, ఆర్‌ఓలు, ఎన్నికల సిబ్బంది తదితరులున్నారు.

తిరస్కరణలపై ఆందోళన

అప్పీల్‌కు వెళ్లినా ఫలితం శూన్యం



ఆందోళన చేస్తున్న నామినేషన్ తిరస్కరణకు గురైన బాధితులు

ఆత్మకూరు(ఎస్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మొదటి విడతలో నామినేషన్ల తిరస్కరణతో ఆశావహులు ఖంగుతిన్నారు. పలువురు సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్‌లుగా ప్రజాసేవ చేయాలనుకుని నామినేషన్‌లు దాఖలు చేశారు. అయితే అధికారులు సరైన సూచనలు నిబంధనలు తెలుపకుండానే నామినేషన్ల అనంతరం వాటిని తిరస్కరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంతకాలు సక్రమంగా లేవని నామినేషన్ పత్రాలు అసంపూర్తిగా నింపారని నామినేషన్లు తిరస్కరించారని పలువురు ఆరోపిస్తున్నారు. నామినేషన్ క్లస్టర్‌ల వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటుచేసి అభ్యర్థులకు నామినేషన్ పత్రాల పంపిణీ, సరైన సూచనలు చేయాల్సిన అధికారులు ఎలాంటి సహకారం అందించలేదన్నారు. హెల్ప్‌డెస్క్‌లు బోర్డులకే పరిమితమయ్యే తప్ప సిబ్బందిని ఏర్పాటుచేయలేదు. నామినేషన్‌లను వేసే సమయంలో నామినేషన్ పత్రాలతో పాటు జతచేయాల్సిన ప్రతుల గురించి కనీసం సూచించాల్సిన సిబ్బంది లేకపోవడంతో చాలామంది అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాతర్లపహాడ్ క్లస్టర్‌లో భారీగా తిరస్కరణ

పాతర్లపహాడ్ క్లస్టర్‌లో అత్యధికంగా వివిధ కారణాలతో నామినేషన్లు తిరస్కరించారు. 21 సర్పంచ్ నామినేషన్లు, 45వార్డు సభ్యుల నామినేషన్‌లు తిరస్కరించారు. అప్పీల్ కోసం వెళ్లినా ఆర్డీవో రెండురోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకొని రిజెక్ట్ చేశారని బాధితులు ఆరోపించారు. రాజకీయ ఒత్తిడితో నామినేషన్లను తిరస్కరించిన అధికారులపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి కోర్టును ఆశ్రయిస్తామని పలువురు తెలిపారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

ఎస్పీ కొత్తపల్లి నర్సింహ



సూర్యాపేట క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్‌యాక్ట్-30 ఈనెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటుందని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. మంగళవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీస్‌యాక్ట్‌ను అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో పోలీస్ అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు, సభలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించవద్దన్నారు. పోలీస్ శాఖ నుంచి అనుమతులు లేకుండా నిబంధనలు అతిక్రమించి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల జీవనానికి ఇబ్బందులు కలిగించినా, సోషల్ మీడియాలో అసత్యాలను వ్యాప్తిచేసినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

మద్యం సీసాలను పొలాల్లో వేయవద్దు

కొంతమంది బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ఖాళీ సీసాలను సమీపంలోని ఖాళీ ప్రదేశాలు, పొలాల్లో వేస్తున్నారని దాంతో రైతులు, కూలీలకు ఇబ్బందులు కలుగుతాయని ఎస్పీ కొత్తపల్లి నర్సింహ అన్నారు. ఖాళీ సీసాలను వ్యవసాయ పొలాల్లో వేయడం వల్ల పనులు చేసే రైతులు, కూలీలు గాయపడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామన్నారు.

350 క్వింటాళ్ల నల్లబెల్లం

పౌడర్ పట్టివేత

వివరాలు 6లో

అంగన్‌వాడీకి రాజీనామా...
సర్పంచ్‌గా బరిలోకి


జనగాం సుధారాణి

ఆలేరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల్లో నిలబడేందుకు అంగన్‌వాడీ టీచర్ తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో 20 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా జనగాం సుధారాణి పనిచేస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడతలో కొల్లూరు గ్రామం జనరల్ మహిళకు రిజర్వు అయ్యింది. దీంతో ప్రజా సేవ చేయాలనే లక్ష్యంతో ఉన్న సుధారాణి నెలకు రూ.15 వేలకు పైగా వేతనం వచ్చే ఉద్యోగానికి రాజీనామా చేసి సర్పంచ్‌గా నామినేషన్ దాఖలు చేసింది. గ్రామసేవ లక్ష్యంతో సర్పంచ్ బరిలోకి దిగానని, ప్రజలు తనకే పట్టం కడతారని ఆశిస్తున్నట్లు సుధారాణి తెలిపింది.

ఓటరు లేడు.. ఎన్నికలెట్లా..

● మల్కాపూర్ 8వ వార్డుకు నామినేషన్ నిల్
● ఎస్టీలు లేని చోట రిజర్వు

తుర్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మల్కాపూర్ పంచాయతీలో 8వార్డుకు ఎన్నికలు జరిగే అవకాశం లేకుండాపోయింది. మొత్తం 8 వార్డులుండగా 8 వార్డు ఎస్టీ జనరల్‌కు రిజర్వ్ అయింది. అయితే గ్రామంలో ఎస్టీ ఓటర్లు ఒక్కరూ లేరు. దీంతో ఈ వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. కాగా 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ వార్డు ఎస్టీకి రిజర్వ్ అయినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రామపంచాయతీ పరిధిలో మల్కాపూర్‌తో పాటు బీల్యానాయక్‌తండా, బద్దుతండా గ్రామాలు ఉండేవి. 2018లో రెండు తండాలూ పంచాయతీలుగా ఏర్పడ్డాయి. దీంతో సమస్య ఉత్పన్నం అయినట్లు అధికారులు తెలిపారు. ఈ వార్డులో ఇద్దరు ఎస్టీ ఓటర్లు ఉండగా ఇటీవల బీల్యానాయక్‌తండాకు తమ ఓట్లను మార్చుకున్నారు. దీంతో ఈ వార్డు సభ్యులు సర్పంచ్ అభ్యర్థులకు మాత్రమే ఓటు వేయనున్నారు.

అవకాశం దక్కలేదని ఆగ్రహం


వాహనంపై ఉన్న పార్టీ నాయకుడి చిత్రాన్ని తీసివేస్తున్న కార్యకర్త

మేళ్లచెర్వు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమైన ఆశావహుల్లో కొందరికి నిరాశే ఎదురవుతోంది. దీంతో నిన్నటి వరకు కొనసాగిన పార్టీపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం వేపలమాదారం గ్రామంలో సర్పంచ్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు అయ్యింది. అయితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బండ్ల జయరాజుకు అవకాశం ఇస్తామని పార్టీ నేతలు గతంలో హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆ హామీని మరిచి వేరే వారిని పార్టీ తరుపున అభ్యర్థిగా ప్రకటించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన జయరాజు అతడి ద్విచక్రవాహనంపై ఉన్న ప్రజాప్రతినిధి చిత్రపటానికి సంబంధించిన స్టిక్కర్‌ను తొలగించాడు. దాంతో పాటు పార్టీ కండువాలను నాయకులు కాల్చి ధ్వంసం చేశారు.

పోటీ చేసేలా చూడండి

మాడ్గులపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఓటు హక్కు కల్పించి, నామినేషన్ చెల్లుబాటు అయ్యేలా చూడాలని నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన చింతమల్ల కల్పన అలియాస్ ధరావత్ కల్పన మంగళవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఇందుగుల గ్రామానికి చెందిన చింతమళ్ల రాంప్రసాద్, త్రిపురారం మండలంలోని చౌళ్లతండాకు చెందిన ధరావత్ కల్పనలు రెండేళ్లకిందట ప్రేమించి పెళ్లిచేసుకున్నారు. వీరికి ఒక పాప ఉంది. ఇందుగుల గ్రామంలో నల్లగొండ శాసనసభ నియోజకవర్గంలోని 252 పోలింగ్ స్టేషన్‌లో 951 క్రమ సంఖ్యలో తనకు ఓటు ఉందని, కానీ ఇందుగుల గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో నమోదు చేయలేదన్నారు. దీంతో హైకోర్టును ఇటీవల సంప్రదించగా ఖచ్చితంగా ఓటరు జాబితాలో ఓటును చేర్చాలని హైకోర్టు తీర్పు ఇవ్వడంతో మంగళవారం ఇందుగుల గ్రామంలో నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. నామినేషన్ చెల్లుబాటు అయ్యేవిధంగా చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని ఆమె కలెక్టర్ ఇలా త్రిపాఠిని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఇందుగుల ఎస్టీ మహిళకు రిజర్వ్ కావడంతో తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోకపోవడంతో చేసేదేమి లేక హైకోర్టును ఆశ్రయించామని, హైకోర్టు తీర్పు ఇవ్వడంతో నామినేషన్ దాఖలు చేశానన్నారు.

ఏకగ్రీవం దిశగా...

● పలుచోట్ల గ్రామసభలు నిర్వహించి ఏకగ్రీవాలకు తీర్మానం
● గ్రామాభివృద్ధికి తోడు ఆలయాల నిర్మాణాలకు విరాళాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొదటి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో పలుచోట్ల ఏకగ్రీవాల దిశగా అడుగులుపడుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు నేటితో గడువు ముగుస్తుండటంతో పాటు పలు చోట్ల ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.


కంపరాజు వెంకటేశ్వర్‌రాజు

ఆలేరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీగా ఏర్పడిన గ్రామానికి మొదటి సర్పంచ్ కావాలన్న తపన ఆయనకు అదృష్టంగా కలిసి వస్తోంది. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక శివారు గ్రామంలోని బైరాంనగర్, రాజానగరం గ్రామాలను కలిపి బైరాంనగర్ గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయగా మొదటిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. మొదటి సర్పంచ్‌గా కావాలన్న తలంపుతో ఉన్న కంపరాజు వెంకటేశ్వర్‌రాజుకు ఆ అవకాశం వరించింది. ఇరుగ్రామాల పెద్దలు కూర్చుని సమన్వయంతో ఏకగ్రీవంగా చేసుకోవడంతో సఫలమయ్యారు. ప్రత్యర్థిగా బరిలో దిగిన నంద మహేందర్ తన నామినేషన్‌ను మంగళవారం ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ గ్రామపంచాయతీ ఏకగ్రీవం కానుంది. ఈ విషయమై రిటర్నింగ్ అధికారి మంజులను అడుగగా ఉపసంహరించుకున్నది వాస్తవమే అయినప్పటికీ బుధవారం అధికారిక ప్రకటన ఉంటుందన్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏకగ్రీవం కావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆనందం నెలకొంది.

రామన్నపేట : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం నిదానపల్లిలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవం కానున్నారు. సర్పంచ్‌తో పాటు ఏడువార్డులకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సర్పంచ్ పదవికి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన నారపాక మాధవి యాదయ్య, వార్డు సభ్యులుగా చల్ల శిల్ప, కొండ శ్రీను, వర్కాల వినయ్, భాషమల్ల అనిత, కొండ అండాలు, కడారి ఐలయ్యలు ఒక్కొక్కటిగా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

గుర్రంపోడు మండలంలో రెండు సర్పంచ్ స్థానాలు..

గుర్రంపోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా గుర్రంపోడు మండలంలో రెండు పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. బుడ్డారెడ్డిగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారం నిర్వహించిన గ్రామసభలో సింగెం బాలకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. జనరల్ స్థానం రిజర్వు కావడంతో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. బుడ్డారెడ్డిగూడెం, బోడపాడు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ఆంజనేయస్వామి దేవాలయాల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు రూ.25.20 లక్షలు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిన సింగం బాలకృష్ణను ఏకగ్రీవంగా గ్రామసభలో తీర్మాణించినట్లు సమాచారం. యలమోనిగూడెం గ్రామంలో సర్పంచ్‌గా వాడపల్లి వెంకన్నను ఎన్నుకునేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. గ్రామ ంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు చేస్తానని ముందుకు వచ్చిన వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు తీర్మాని ంచినట్లు తెలిసింది. మూడవ విడత ఈ నెల 3 నుంచి జరిగే నామినేషన్ ప్రక్రియలో గ్రామస్థుల నిర్ణయం మేరకే నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఈమేరకు సామాజిక మాధ్యమాల్లో ఏకగ్రీవాలు వైరల్‌గా మారాయి.

రామచంద్రాపురంలో రెండోసారి..

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం రామచంద్రాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి, వార్డుసభ్యులు ఏకగ్రీవం కానున్నారు. రెండో విడతలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. అయితే సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్, 8 వార్డు సభ్యుల స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయి. ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చే నజరానాను గ్రామ అభివృద్ధికి వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో 2018 ఎన్నికల్లో బీసీ జనరల్ రిజర్వేషన్ కావడంతో భువనగిరి శ్రీనివాస్ గౌడ్‌ను సర్పంచ్‌గా, 8మంది వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా ప్రస్తుతం జనరల్ మహిళకు రిజర్వుడ్ కావడంతో గ్రామస్థులు, కుల పెద్దలు సమావేశమై తీర్మానించి కొలను రవికళారెడ్డిని ఏకగ్రీవం చేసేందుకు యత్నించారు. దీంతో ఆమె ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. అధికారులు అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. గతంలో 2018లో ఏకగ్రీవంగా ఎన్నికైన భువనగిరి శ్రీనివాస్ గౌడ్ 20గుంటల భూమి విరాళమివ్వడంతో ఆ స్థలంలో గ్రామస్థులు శ్మశానవాటికను ఏర్పాటుచేశారు. ప్రస్తుతం సర్పంచ్‌గా ఏకగ్రీవం కాబోతున్న కొలను రవికళారెడ్డి గ్రామాభివృద్ధికి రూ.27లక్షల విరాళంగా ప్రకటించారు. అయితే ప్రభుత్వం అందజేస్తున్న ఏకగ్రీవ నజరానా, సర్పంచ్ ఇస్తున్న విరాళంతో తమ గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధికి నోచుకుంటుందని గ్రామస్థులు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఉపసర్పంచ్‌గా సుర్వంగ చందు పేరును గ్రామస్థులు ప్రతిపాదించారు.



నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా సేవలు

● 15 ఏళ్ల పాటు బీ వెల్లెంల సేవలో రాంరెడ్డి

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)


కోమటిరెడ్డి రాంరెడ్డి

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి సర్పంచ్‌గా కోమటిరెడ్డి రాంరెడ్డి నాలుగు పర్యాయలు సేవలు అందించారు. టెక్స్‌మో రాంరెడ్డిగా సుపరిచితులైన ఆయన జిల్లా మంత్రి, ఇదే గ్రామానికి చెందిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబానికి సమీప బంధువు. కాంగ్రెస్ పార్టీ తరపునే నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా గెలిచి గ్రామానికి సేవలందించారు. నేటికీ ఆయన కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారు. 1982లో మొదటిసారి సర్పంచ్ పదవిని చేపట్టిన ఆయన 1997వరకు 15 ఏళ్ల పాటు గెలిచి కొనసాగారు. అనంతరం పంచాయతీలకు రిజర్వేషన్ వ్యవస్థ రావడంతో బీసీలకు రిజర్వ్ అయ్యింది. దీంతో పోటీ చేయలేకపోయారు. అనంతరం మళ్లీ జనరల్‌కు రిజర్వు కావడంతో 2002-2007 వరకు సర్పంచ్‌గా పనిచేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఆయనను పలకరించగా అప్పటి ఎన్నికల తీరును గుర్తుచేశారు. అప్పటి ఎన్నికల్లో ఓటర్లైనా, రాజకీయ నాయకులైనా నైతిక విలువలకు కట్టుబడేవారని చెప్పారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్నారు. సర్పంచ్‌గా రెండో పర్యాయం వరకు ఒక్క వార్డుకు కూడా మహిళా సభ్యులు లేరన్నారు. సేవ చేయగలిగే సామర్థ్యం ఒకటే చూసేవారని ఇపుడు డబ్బు, మద్యం పంచనిదే ఓట్లు వేయనిస్థితికి కాలం మారిపోవడం బాధాకరమన్నారు. తాను సర్పంచ్‌గా పనిచేసిన సమయంలోనే ఇపుడున్న గ్రామపంచాయతీ భవనాన్ని, ఉన్నత పాఠశాలను నిర్మించానని, కంచనపల్లి నుంచి బీ.వెల్లెంల వరకు రోడ్డును వేయించానన్నారు. సుమారు 18 ఎకరాల భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించానని రాంరెడ్డి గుర్తుచేశారు.

గుర్తుంచుకునేలా..

● ఆకర్షణీయంగా ఎన్నికల గుర్తులతో బ్యానర్లు, బ్యాడ్జీలు, స్టిక్కర్లు





నల్లగొండలోని ఓ దుకాణంలో ఎన్నికల గుర్తులతో కూడిన సామాగ్రి



పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఉండరు. ఈ నేపథ్యంలో వివిధ ఆకారాల్లోని వాటిని గుర్తులుగా కేటాయిస్తుంటారు. దీంతో ఓటర్లు ఇట్టే గుర్తులను గుర్తుంచుకునేలా అభ్యర్థుల కోసం బ్యానర్లు, స్టిక్కర్లు, బ్యాడ్జీలను వ్యాపారులు సిద్ధం చేశారు. మొదటి విడతలో బుధవారం గుర్తుల కేటాయింపుతో వీటికి గిరాకీ రానుంది. వివిధ రంగుల్లో ఆకర్షణీయంగా వాటిని తయారు చేశారు.
ఫొటో : నల్లగొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సీఎం సభకు వెళ్లి వస్తూ చెట్టును ఢీకొన్న కారు

● ముగ్గురు ఏఎస్‌ఐలు, ఒక హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

గుర్రంపోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్ వద్ద సీఎం సభకు వెళ్లి వస్తున్న పోలీసు వాహనం అదుపు తప్పింది. ఈ ఘటనలో పలువురు పోలీసులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సీఎం సభ బందోబస్తుకు వెళ్లి విధులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని తానేదార్‌పల్లి(జువ్వగూడెం) వద్దకు రాగానే సోమవారం రాత్రి అదుపుతప్పిన పోలీస్ వాహనం చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో నల్లగొండ టూటౌన్‌లు ఏఎస్‌ఐలు నర్సింహారెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయని గుర్రంపోడు ఎస్‌ఐ మధు తెలిపారు. నల్లగొండ ఆసుపత్రిలో చికిత్స వారు చికిత్స పొందుతున్నారని ఎస్‌ఐ తెలిపారు. గాయపడిన సిబ్బందిని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.


నల్లగొండలో చికిత్స పొందుతున్న పోలీసులను పరామర్శిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్

డివైడర్‌ను ఢీకొని ఒకరు..

చివ్వెంల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బండమీదిచందుపట్లలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆత్మకూరు(ఎస్) మండలం దాచారం గ్రామానికి చెందిన నవీన్ స్వగ్రామం నుంచి ఖమ్మం వెళ్తున్నాడు. ఆ క్రమంలో చందుపట్ల వద్దకు రాగానే అతివేగంతో స్కూటీ వాహనం నడుపుతూ సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిపై డివైడర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. నవీన్ మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

చదువు ఇష్టంలేక
కేజీబీవీ ప్రహరీ దూకి ..

● వెతికి పట్టుకున్న పోలీసులు ● తల్లిదండ్రులకు అప్పగింత

మునుగోడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల(కేజీబీవీ) నుంచి పారిపోయిన బాలిక ఆచూకీ పోలీసులకు లభ్యమైంది. వెంటనే ఆ బాలికను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బాలిక ఆదివారం సాయంత్రం భోజన సమయంలో పాఠశాల ప్రహరీ పైనుంచి దూకి తప్పించుకుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పాఠశాల ప్రత్యేకాధికారి(ఎస్‌వో) పుష్పలత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించి ఎస్‌ఐ రవి ప్రత్యేక బృందంతో గాలింపు చేపట్టారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్న తర్వాత ప్రయాణికుల ఆటోలో నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలోని రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడికి వెళ్లి బాలికను అదుపులోకి తీసుకుని మంగళవారం సఖీ కేంద్రానికి తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చదువంటే ఇష్టం లేకనే పారిపోయినట్లు బాలిక చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా బాలిక పారిపోయిన వ్యవహారంపై వెంటనే స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆమె ఆదేశాల ప్రకారం డీఈవో భిక్షపతి పాఠశాలను సందర్శించి విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ప్రకారం ఎస్‌వోను విధుల నుంచి తొలగించటంతో పాటు విధుల్లో సీఆర్టీలకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కిడ్నాప్ వ్యవహారంలో కొనసాగుతున్న దర్యాప్తు

తిప్పర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం యల్లమ్మగూడెం గ్రామంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి భర్త కిడ్నాప్ వ్యవహారంపై మంగళవారం ఉదయం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కిడ్నాప్ చేసిన వారిపై మూడు రోజులుగా కేసు నమోదు చేయకుండా, అరెస్ట్ చేయకుండా ఉంటున్నారని బాధితులు నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి సోమవారం ఫిర్యాదుచేశారు. ఈ మేరకు శాలిగౌరారం సీఐ కె.కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బాధితుడిని కలిసి విచారణ చేస్తున్నారు. అతడిని ఎక్కడ నుంచి తీసుకెళ్లారు, కిడ్నాప్ చేసిన సమయంలో ఎంతమంది పాల్గొన్నారు. ఏ ప్రదేశంలో ఇబ్బందులకు గురిచేశారు అనే విషయాలను బాధితుడి ద్వారా అడిగి తెలుసుకుంటున్నారు. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి


తాటిచెట్టు పైనుంచి పడిన యాదయ్య

తిరుమలగిరి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. వెలిశాల గ్రామానికి చెందిన చీకటి యాదయ్య(60) శనివారం తాటి చెట్టు పైనుంచి కాలుజారిపడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు యాదయ్య భార్య సుశీల తెలిపారు. గీత కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని కల్లు గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి చిత్తలూరి సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు.

350 క్వింటాళ్ల నల్లబెల్లం పొడర్ లారీ పట్టివేత


నల్లబెల్లం పౌడర్‌ను తరలిస్తుండగా పట్టుకున్న లారీతో ఎక్సైజ్ అధికారులు

మోతె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అనుమతుల్లేకుండా తరలిస్తున్న 350 క్వింటాళ్ల నల్లబెల్లం పౌడర్ లోడు లారీని పట్టుకున్నట్లు నల్లగొండ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారం మేరకు సూర్యాపేట ఎక్సైజ్ సిబ్బందితో కలిసి సూర్యాపేట జిల్లా మోతె మండలం సింగరేణిపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కేఏ 39 ఏ 2050 నెంబరు గల లారీ అతివేగంతో వెళ్తుండగా అనుమానంతో వెంబడించి పట్టుకున్నారు. లారీలో 1,167 పౌడర్ బస్తాల్లో 30 కిలోల చొప్పున 350.1 క్వింటాళ్ల నల్లబెల్లం పౌడర్‌ను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ సరుకును తరలిస్తున్న కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా చినచోళీ తాలుకాకు చెందిన శ్యామ్, జగన్నాథ్‌లను అరెస్టుచేసి లారీని స్వాధీనం చేసుకున్నట్లు సంతోష్ తెలిపారు. దాడుల్లో సూర్యాపేట ఎక్సైజ్ సీఐ మల్లయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు గోపాల్‌రావు, శోభారాణి, సిబ్బంది అప్సర్, వనజ, గౌతమి, బ్రమ్మం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

వలిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని మంగళవారం సాయంత్రం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలో స్థానిక తొర్రూర్ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన వాహనాన్ని తనిఖీచేశారు. ఆ వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యాన్ని గుర్తించారు. రాయల్ స్టాక్ 2 లీటర్ల బాటిళ్లు 15, ఐబీ క్వార్టర్ బాటిళ్లు 48 ఉన్నట్లు గుర్తించారు. మొత్తం మద్యం 38.64లీటర్లు ఉండగా సుమారు రూ.42,504 విలువైనదిగా పోలీసులు తెలిపారు. బాటిళ్లతో పాటు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాతృత్వం..



యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు మచ్చ నర్సింహాగౌడ్ అర్థాకలితో అల్లాడుతున్న వానరాలకు అరటిపండ్లు అందిస్తున్నారు. రెండు రోజులుగా సుమారు 200 వానరాలకు అరటి పండ్లు అందజేశాడు. అదేవిధంగా గోశాలకు ఉచితంగా పశుగ్రాసం, పక్షులకు గింజలు, చీమలకు స్వీట్స్ అందజేసూ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.
(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

జనగామ జిల్లాలో
యాదాద్రి జిల్లా మహిళ మృతి


సుజాత మృతదేహం

లింగాలఘణపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్‌పై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రిభువనగిరి జిల్లా మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మండలం టంగుటూరు గ్రామానికి చెందిన కళ్లెపు సుజాత(40) కొంతకాలంగా జనగామలో నివాసముంటోంది. కాగా భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న సుజాత పనులను ముగించుకుని మరో కార్మికుడు శీలం మోహన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై జనగామకు బయలుదేరింది. ఈ క్రమంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డ సుజాతను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. మరో కార్మికుడు మోహన్ అనే వ్యక్తి గాయాలయ్యాయి. లింగాలఘణపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతురాలికి కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

మనోధైర్యమే ఆయుధం

అంగవైకల్యాన్ని జయించి, మనోధైర్యంతో జీవన అవరోధాలను దాటుతున్న వజ్ర సంకల్పులు దివ్యాంగులు.. అందరితో సమానంగా పోటీపడుతూ అభివృద్ధికి అంగవైకల్యం అడ్డుకాదని నిరూపిస్తూ భవితకు బాటలు వేసుకుంటున్నారు. పరిపాలనలోనూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ, పోటీ పరీక్షల్లోనూ రాణిస్తున్నారు. అయినా జీవన సమరపు గమనంలో అనేక ఆటుపోట్లకు గురవుతున్నారు. ఈ నెల 3వ తేదీన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కొందరి మనోగతం ఇలా..

• (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

అడుగడుగునా వివక్షకు గురవుతున్నాం



దివ్యాంగులను కొంతమంది చిన్నచూపు చూస్తుండటంతో అడుగడుగునా వివక్షకు గురవుతున్నాం. చదువుకోవడానికి పాఠశాలకు వెళ్లినా తోటి విద్యార్థులు హేళన చేస్తున్నారు.రాజకీయం, చదువు, ఉద్యోగ విషయాల్లో అడుగడుగునా అన్నీ అడ్డంకులే ఎదురవుతున్నాయి. సమాజంలో వికలాంగులకు ప్రత్యేక స్థానం ప్రభుత్వం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- బుడిగె నాగరాజు, యాదగిరిగుట్ట


విజయం సాధిస్తాననే ధీమాతోనే..



ఎంఏ, బీఈడీ చేసినా ఇప్పటి వరకు ఉద్యోగావకాశం దక్కలేదు. దివ్యాంగుల కోటా ఉన్నప్పటికీ ఎంత ప్రయత్నం చేసినా నిరాశే మిగిలింది. ఉద్యోగం లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురయ్యాను. విద్యాభ్యాసం నుంచి అడుగడుగునా అవమానాలు ఎదురైనా ఫలితం దక్కలేదు. ఇప్పటి వరకు ఉద్యోగం వస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. ఎప్పటికైనా విజయం సాధిస్తానే ధీమాతో ముందుకు సాగుతున్నాను. ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహం అందించాలి.

-రాణి, సైదాపురం, యాదగిరిగుట్ట మండలం

నామినేటెడ్ పోస్టులు అమలు చేయాలి



ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు అన్ని రంగాల్లోనూ నామినేటెడ్ పోస్టులు అమలు చేయాలి. ప్రతీ దివ్యాంగుడికి రూ.4వేల పింఛన్ నుంచి 6వ వరకు పెంచుతూ ఆర్టీసీ బస్సుల్లో 50శాతం రవాణాకు కాకుండ మహిళలకు ఏవిధంగా ఉచితం ప్రయాణం చేస్తున్నారో అదేవిధంగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి. దివ్యాంగులకు సంక్షేమశాఖ ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించి, దేవాలయాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ల పరిసరాల్లో ఉపాధికోసం దుకాణాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-వనం ఉపేందర్, ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి, యాదాద్రిభువనగిరి

స్వామికి పూలేవీ? పండ్లేవీ?

• గిట్టుబాటు కాక దుకాణం మూసేసిన టెండరుదారు

యాదగిరిగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం రెండో అన్నవరంగా ప్రసిద్ధి. నిత్యం సత్యనారాయణస్వామి వ్రతాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వ్రతాలకు సంబంధించి వస్తు సామగ్రిని దేవస్థానం సరఫరా చేస్తుండగా .. పూలు, పండ్లు విక్రయించేందుకు అధికారులు టెండరును ఆహ్వానించారు. నాలుగు నెలల తర్వాత వ్యాపారంలో నష్టం వాటిల్లిందని, గిట్టుబాటు కాదని ఈవో కార్యాలయానికి టెండరుదారుడు వారం ముందుగానే లిఖిత పూర్వకంగా విన్నవించాడు. టెండరు ద్వారా పూలు, పండ్లు విక్రయించే టెండర్‌దారు దుకాణాన్ని మూసివేయ డంతో భక్తులకు అవి అందుబాటులో లేవు. కానీ, రూ.1000 టిక్కెట్‌తో వ్రతానికి కావాల్సిన ఆరు కొబ్బరికాయలు, 260 గ్రాముల చెక్కర, 250 గ్రాముల గోధుమ రవ్వ, 200గ్రాముల బియ్యం, 21 పోకలు, తమలపాకులు, ఐదు ఖర్జూరాలు, 15 గ్రాముల కుంకుమ, పసుపు, 20 గ్రాముల బుక్క, 10 గ్రాముల గులాలు, కాజు, కిస్‌మిస్‌లు, దూది, 20/20 తెల్ల వస్త్రం, ఒక కుడుక, 20 గ్రాముల నూనె, ఐదు గ్రాముల తేనె, 50 గ్రాముల నెయ్యి, పంచామృతం, ఒక జాకెట్ ముక్క, శెల్ల, కనుము వంటి వ్రత సామగ్రిని దేవస్థానం సరఫరా చేస్తోంది.

టెండరు గడువు ఇలా..

పూలు, పండ్లు విక్రయించేందుకు దేవస్థానం అధికారులు 2025 జూన్ 14 ప్రకటన విడుదల చేసి 27వ తేదీన టెండరు నిర్వహించారు. ఏడాది వ్యవధికి స్థానికురాలు మార్గం కమశమ్మ రూ. 80లక్షలకు టెండరు దక్కించుకుంది. మొత్తం టెండరు సొమ్ము మూడు భాగాలుగా విభజించి ఆగస్టు ఒకటో తేదీ నుంచి నవంబరు 30 వరకు మొదటి విడత అధికారులు డిపాజిట్ సేకరించారు. గడువు ముగిసే సరికి నష్టాలు వస్తున్నాయని, వ్యాపారం చేయలేనని టెండరుదారు చేతులెత్తేసింది. ఆమె ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పూలు, పండ్ల లేని పూజలు కొనసాగుతున్నాయి. ఇదే అంశంపై ఆలయ డీఈవో దోర్బల భాస్కర శర్మను వివరణ కోరగా పూలు, పండ్ల కోసం త్వరలో టెండరును ఆహ్వానిస్తామన్నారు.



కొండ కింద వ్రతాల భవనం (పూలు, పండ్లు) వద్ద మూసిన రేకుల షెడ్డు

నేడు జిల్లా జట్ల ఎంపిక

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్- 19 ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ బాలబాలిక జట్ల ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఎన్‌ఈ కళాశాల మైదానంలో ఈనెల 3వతేదీన నిర్వహిస్తున్న జిల్లా కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి తెలిపారు. వివరాలకు సెల్ నెం.8096745465 సంప్రదించాలన్నారు.

కిడ్నాప్ చేయడం దుర్మార్గం

భానుపురి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడెంలో మామిడి యాదగిరిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమని సూర్యాపేట అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షుడు మర్యాద సైదులు యాదవ్ అన్నారు. మంగళవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ అభ్యర్థిగా నాగలక్ష్మి నామినేషన్ వేస్తే ఏకగ్రీవం కాదని, ఆమె భర్త యాదగిరిని కిడ్నాప్ చేసి దాడితో పాటు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి విద్యార్థిపై క్రికెట్ బ్యాట్‌తో దాడి

- గత నెల 29న రాజాపేట గురుకులంలో ఘటన
- ఓ విద్యార్థి 'ఇన్‌స్టా'లో వీడియో పెట్టడంతో వెలుగులోకి
- ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల ఆగ్రహం
- ఏడుగురు ఇంటర్ విద్యార్థుల సస్పెన్షన్

రాజాపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాదాన్ని సర్దిచెప్పేందుకు వెళ్లిన విద్యార్థిపై సహచరులు క్రికెట్ బ్యాట్, వికెట్లతో దాడిచేశారు. ఈ ఘటనను ఓ విద్యార్థి వీడియో తీసి ఇన్‌స్టా(సోషల్ మీడియా)లో పోస్టు చేయడంతో విషయం వెలుగుచూసింది. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. రాజాపేట గురుకుల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు మొత్తం 600మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన ముస్త్యాల సుదర్శన్ లావణ్య దంపతుల రెండో కుమారుడైన ముస్త్యాల కౌశిక్ ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. చదువులో చురుకుగా ఉండటంతో హాస్టల్‌లో రూం వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత నెల 29వ తేదీ రాత్రి 11.30గంటలకు కొంతమంది ఇంటర్ విద్యార్థులు గొడవపడటంతో కౌశిక్ వారి సర్ది చెప్పి తన గదికి చేరుకున్నాడు. కొద్దిసేపటికే కొంతమంది ఇంటర్ విద్యార్థులు కౌశిక్ ఉన్న గదికి వచ్చి క్రికెట్ బ్యాట్, వికెట్‌లతో దాడి చేయటంతో స్వల్పగాయాలయ్యాయి. కొంత మంది విద్యార్థులు అడ్డుపడటంతో కౌశిక్ అక్కడ నుంచి తప్పించుకుని పాఠశాల ప్రిన్సిపాల్ గదికి చేరుకున్నాడు. ఉపాధ్యాయులు కౌశిక్ గది వద్దకు వెళ్లి వివాదాన్ని సర్దుమణిగేలా చేశారు. అయితే ఓ విద్యార్థి ఈ ఘటనను ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి ఇన్‌స్టా(సోషల్‌మీడియా) లో పోస్టు చేయడంతో తల్లిదండ్రులకు తెలిసింది. ఇంత జరిగినా పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడంతో వారు మంగళవారం ఉదయం బంధువులతో కలిసి పాఠశాలకు చేరుకున్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌ను, ఉపాధ్యాయులను నిలదీసి ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ కుమారుడిపై దాడికి పాల్పడిన విద్యార్థులపై పోలీసు కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రిన్సిపాల్ సుధాకర్ స్పందిస్తూ తన మాతృమూర్తి మృతి చెందడంతో గత నెల 30తేదీ వరకు సెలవులో ఉన్నానని, విధుల్లో చేరగానే విషయం తెలియటంతో ఏడుగురు ఇంటర్ విద్యార్థులను సస్పెండ్ చేశామని తెలిపారు. సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపారు.



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను నిలదీస్తున్న బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

యాదగిరిగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలోని క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు తమలపాకులు, సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచారాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటిక మూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.48,85,637 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.



ఆంజనేయస్వామికి హారతి నివేదిస్తున్న అర్చకులు

మట్టపల్లిలో స్తంభోద్భవుడికి విశేష అర్చనలు

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనృసింహుని ఆలయంలో శ్రీస్వామికి మంగళవారం విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో ప్రాతఃకాలార్చనలు పూర్తయాక అర్చకులు వ ుూల వ ర్యు లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పుష్పాలంకరణల అనంతరం స్తంభోద్భవునికి అరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, యాగ మండపంలో నారసింహ సుదర్శన హోమలు చేపట్టారు. ఉపాలయాల్లో పరివార దేవతలకు ప్రాభోది నివేదనలు సమర్పించాక క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి సహస్ర నాగవల్లీ దళార్చన జరిగింది. కాగా నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఇంచార్జి ఈఓ అజ్మీర జ్యోతి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

9న కొబ్బరికాయలు విక్రయించే హక్కుకు బహిరంగ వేలం..

మట్టపల్లి మహాక్షేత్రంలో కొబ్బరికాయలు విక్రయించే హక్కుకు ఈనెల 9వ తేదీన క్షేత్రంలో బహిరంగా వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈవో అజ్మీర జ్యోతి మగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు స్వామివారి పేరున రూ.3లక్షలు డిపాజిట్ చేసి పాల్గొనాలని, పూర్తి వివరాలకు దేవాలయ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సామాజిక పోకడలపై అడపాల కవిత

• కవి, వ్యాఖ్యాత, గాయకుడు, రంగస్థల కళాకారుడిగా రాణింపు



శేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న అప్పటి ఉమ్మడి నల్లగొండ జిల్లా జడ్పీ చైర్మన్ బాలూనాయక్

డిండి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగు భాషపై ఉన్న మక్కువతో వృత్తినే ప్రవృత్తిగా చేసుకుని ప్రజల్లోకి ప్రవహించే కవిగా సాహిత్య సృజన చేస్తున్నారు అడపాల శేఖర్‌రెడ్డి. తన తొలి కవిత సంపుటి అయిన 'ప్రగతి గీత'లో సామాజిక పోకడలను ఎలుగెత్తి చాటారు. వచన కవిత్వంలోనూ లయతూగుతూ ఉండాలనే ఉద్దేశం తో పద్యమా అన్నంతగా గీతా మాదుర్యం ధ్వనించేటట్లుగా రచనలు చేస్తారు. డిండి మండలం చెర్కుపల్లి గ్రామానికి చెందిన అడపాల శేఖర్‌రెడ్డి విశ్రాంత తెలుగు పండితుడు. తన రచనల్లో సమాజానికి ఓ సందేశం ఇస్తారు. కవిగా సమకాలిన వర్తమాన పరిస్థితులను చిత్రీకరిస్తూ మాయమై పోతున్న మానవ సంబంధాలను కళ్లకు కట్టినట్లు తన రచనలు ప్రతిబింబిస్తున్నారు. దేవరకొండ సాంస్కృతిక సాహితి సమాఖ్య వేదికగా నిరంతర సాహిత్య రచన ప్రక్రియ, కవి సమ్మేళనాల్లో, సాహిత్య గోష్ఠిలో పాల్గొంటూ తన వచన రచనలతో ముందుకు పోతున్నారు ప్రముఖ కవులు జాతీయ సాహిత్య పరిషత్ తెలంగాణ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం ఉప కులపతి ఎన్వీ సత్యానారాయణ వంటి ఎందరో ప్రముఖులు ప్రగతిగీతకు ముందుమాట రాశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా ..

రాష్ట్ర ప్రభుత్వం అడపాల శేఖర్‌రెడ్డి సేవలను గుర్తించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపిక చేసి సన్మానాలతో సత్కరించింది. 2007-2008 విద్యా సంవత్సరంలో సుదీర్ఘకాలం ఉపాధ్యాయుడిగా సేవలు అందించి ఉద్యోగ విరమణ చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంపై శేఖర్‌రెడ్డి గేయ రచనలకు మండల, జిల్లా స్థాయిల్లో నగదు పురస్కారం అందుకున్నారు.

రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా

• అర్ధరాత్రి నల్లగొండ ఎస్పీ ఆకస్మిక తనిఖీ



ముషంపల్లిలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్ల కదలికలపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టారు. అందులో భాగంగా మంగళవారంరాత్రి నల్లగొండ మండలంలోని ముషంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో జిల్లా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వయంగా నేరస్థుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘీక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరిపై పోలీసుల నిఘా ఎప్పటికప్పుడు ఉంటుందని, ఎలాంటి ఘటనలు జరగకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గత ఎన్నికల కేసుల్లో ఉన్న నేరస్థులను ఇప్పటికే బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్‌ను ఉల్లంఘించినా, కొత్తగా గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐలు రాఘవరావు, రాజశేఖర్‌రెడ్డి, నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు పాల్గొన్నారు.

రాజేష్‌ది పోలీసులు చేసిన హత్య: రాజయ్య మాదిగ



కోదాడలో ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

సూర్యాపేట టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గాంధీనగర్‌కు చెందిన కర్ల రాజేష్‌ది ముమ్మాటికీ పోలీసులు చేసిన హత్యేనని ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చింతలచెరువు కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎంఆర్‌ఎఫ్ నిధుల కేసుకు సంబంధించి అరెస్టు చేసిన రాజేష్‌ను వివిధ పోలీస్ స్టేషన్‌లకు తిప్పుతూ చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించే చలో కోదాడ కర్ల రాజేష్ సంతాప సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రవీరస్వామి , బొజ్జ వెంకన్న, సుధాకర్ ప్రదీప్, మల్లేష్, కృష్ణ, నగేష్, సుగుణమ్మ పాల్గొన్నారు

● కోదాడ టౌన్ కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం కోదాడలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోడ సునీల్, చింత వినయ్ మాదిగ, ఏపూరి రాజు, ఏపూరి సత్యరాజు, బచ్చలకూరి ప్రసాద్, యడవల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● గరిడేపల్లి: మాదిగ సామాజిక వర్గానికి చెందిన కర్ల రాజేష్ కేసులో బాధ్యులైన పోలీసు అధికారులపై చట్టపర చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్ష, కార్యదర్శు లు కొత్తపల్లి రవి, కుర్రి వెంకన్నలు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కే ంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో దూరె వినోద్, కడప వీరస్వామి, పిట్ట వెంకటేష్, మాచర్ల వెంకటేశ్వర్లు, నకిరేకంటి రవి, పిట్ట నాగరాజు, పవన్, ఆదాం, రాంబాబు, మచ్చ వేణు, శంకర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

579.70 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా సోమవారం 579.70అడుగులుగా (282.1472 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 5226 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,557 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,006 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 44,006క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. సాగర్ నుంచి వరద కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు రేపు

నల్లగొండ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రి కెట్ అండర్-16 బాలుర జట్ల ఎంపిక పోటీలు ఈనెల 4వతేదీన జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యద్ అమీనోద్దిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన ఆరు జట్లను జిల్లా వేదికగా వన్‌డే లీగ్ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో రాణించిన క్రీడాకారులను ఉమ్మడి నల్లగొండ అండర్-16 క్రికెట్ జట్లుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు, ఆధార్, బోనాఫైడ్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని, ఇతర వివరాలకు 9885717996 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 'మోడల్' విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తుర్కపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో నవంబరు 30న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో తుర్కపల్లి మండలం రామాపూర్ మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులు ఆకుల పూజ, ఎయ్యముల అంజలి, గుండెబోయిన భార్గవి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నల్లగొండ జిల్లా హాలియాలో ఈ నెల నాలుగో తేదీ వరకు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో ఆ విద్యార్థులు ఆడతారని కళాశాల పీడీ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయి ప్రతిభ

సూర్యాపేటఅర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన్ మంథన్ వీవీఎం జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన వైష్ణవి ఐఐటీ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు 11మంది అర్హత సాధించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ కళావతి, ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. మంగళవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో విజయం సాధించగలమని దీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హర్షిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని కాకతీయ ఉన్నత పాఠశాల విద్యార్థి పున్న సతీష్(8వ తరగతి) సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు డైరెక్టర్ చీదళ్ల వెంకట్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో మాట్లాడుతూ విజ్ఞాన భారతి, ఎన్‌సీఈఆర్టీ, నేషనల్ కౌన్సిల్ ఫర్ మ్యూజియమ్స్ సంస్థల సహకారంతో దేశవ్యాప్తంగా నిర్వహించే విద్యార్థి విజ్ఞాన్ మంథన్(వీవీఎం) సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో తమ విద్యార్థి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం ఆదర్శనీయమన్నారు. భారత శాస్త్రవేత్తల సేవలను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే వీవీఎం పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం గొప్ప విషయమన్నారు. డిజిటల్ విధానంలో నిర్వహించిన పరీక్షలో సతీష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడన్నారు. కాగా వీవీఎంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన సతీష్‌ను కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ గుండా హరినారాయణ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, శివప్రసాద్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన వైష్ణవి ఐఐటీ ఒలంపియాడ్ విద్యార్థులు

అంజలీపురం వాసికి ఫోర్డ్ ఇండియా అవార్డు

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అంజలిపురం గ్రామానికి చెందిన గోరె అశోక్ ఫోర్డ్ ఇండియా- వీసర్వ్ ఇండియా అవార్డుకు ఎంపికయ్యారు. గుజరాత్‌లోని గాంధీనగర్ మహాత్మా గాంధీ కన్వెన్షన్‌లో ఈ జాతీయ అవార్డును ఈ నెల 17న అశోక్‌కు కేంద్ర మంత్రులు అందజేయనున్నారు. సౌత్ అండ్ వెస్ట్ రీజనల్ విన్నర్ అవార్డును విశాఖపట్టణంలో నవంబరు 3వ తేదీన అశోక్ అందుకున్నారు. అంజలీపురం గ్రామానికి చెందిన అశోక్ వ్యవసాయ పరికరాలను రూపొందిస్తూ ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వ్యవసాయంలో నాలుగు విధాలుగా పనిచేసే సైకిల్ వీడర్ విత్తనాలు నాటే పరికరం, పాడియం వీడర్ స్ప్రేయింగ్ యంత్రం, సౌరశక్తితో పంట రక్షణ పరికరం, అగ్రోథార్ స్ప్రేయింగ్, కలుపు మొక్కలు తొలగింపు, బరువులు తరలించడానికి ఉపయోగపడే బహుళ ప్రయోజన వాహనం అగ్రోమెట్, పంట కోత తర్వాత పనులకు ఉపయోగించే యంత్రం, డ్రైల్యాండ్ ప్రో 52- ఎకరానికి 1 లీటర్ ఇంధనంతో పనిచేసే యంత్రం వంటివి ఆవిష్కరించడంతో తనను జాతీయ స్థాయిలో వీసర్వ్ - ఇండియా అవార్డుకు ఎంపిక చేశారని అశోక్ తెలిపారు.



గోరె అశోక్

సూర్యాపేట
కోదాడ-హుజూర్‌నగర్-తుంగతుర్తి

బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలి

తిరుమలగిరి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని జలాల్‌పురం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ జి.సోమేష్ కోరారు. మండలంలోని మర్రికుంటతండ ఆవాస ప్రాంతంలో ఇటుక బట్టీల వద్ద ఉన్న పిల్లలను సర్వే చేశారు. వారిని జలాల్‌పురం ఉన్నత పాఠశాలలో, లాక్యతండ ప్రాథమిక పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రులను ఒప్పించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు సత్యనారాయణ, నరేష్‌లు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ ఏడీఈగా శ్రీనివాసరావు



తిరుమలగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నాగారం సబ్ డివిజన్ ఏడీఈగా ఎల్.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు పదోన్నతిపై ఏడీఈగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలగిరి, నాగారం, అర్వపల్లి మండలాల్లో విద్యుత్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

హుండీ కానుకల ఆదాయం రూ.76వేలు

హుజూర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. కార్తీక మాసానికి సంబంధించి హుండీ ఆదాయం రూ.75,958 వచ్చినట్లు ఈవో గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రెంటాల శ్రీనివాస శర్మ, సురేష్, శ్రీనివాసరెడ్డి, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

తిరుమలగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో లాజర్ తెలిపారు. మంగళవారం తిరుమలగిరి మునిసిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిప్రసాద్, మాస్టర్ ట్రైనర్లు అశోక్‌రెడ్డి, సైదులు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలన పేరుతో ప్రజాధనం లూటీ

తుంగతుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా ఏఒక్క హామీని సరిగా అమలు చేయలేని ప్రభుత్వం ప్రజాపాలన అంటూ కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటని అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మరోసారి ఓట్లు దండుకోవాలనే ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తోందని అన్నారు. రైతులకు కనీసం యూరియాను కూడా ప్రభుత్వం అందించలేకపోతోందని అన్నారు. . ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తానని చెప్పి మోసం చేసిందని అన్నారు.

ఇరుపార్టీల మద్దతుతో బరిలో..

కోదాడ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కోదాడ మండలంలో ద్వారకుంట గ్రామ సర్పంచ్ పదవికి బీఆర్ఎస్, టీడీపీలు ఉమ్మడి అభ్యర్థికి మద్దతు ఇస్తున్నాయని పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముత్తవరపు రమేష్ మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న చౌడం వెంకట రామయ్యకు బీఆర్ఎస్ నుంచి పూర్తి మద్దతు ఇస్తున్నామన్నారు. ఇందుకు ఇరు పార్టీల నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. బీఆర్ఎస్ నుంచి టీడీపీలోకి ఎవరూ వెళ్లలేద న్నారు. గ్రామంలో ఏడు వార్డుల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు, ఐదు వార్డుల్లో టీడీపీ మద్దతుదారులు పోటీ చేస్తున్నారని, ఉప సర్పంచ్ పదవితో పాటు ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అవకాశం కల్పించే విధంగా ఇరు పార్టీల నాయకులు కలిసి నిర్ణయించినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రీన్ క్లబ్ ట్రస్టు అధ్యక్షుడు ముప్పారపు నరేందర్ అన్నారు. జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు విధిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తోట కిరణ్, దేవరశెట్టి నాగరాజు, తల్లాడ రామచంద్రయ్య, నెల్లుట్ల వెంకట్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారిని సస్పెన్షన్ చేయాలి

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టికల్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్‌ను కారణం లేకుండా తిరస్కరించిన అధికారిని ప్రభుత్వం సస్పెండ్ చేయాలని మాజీ సర్పంచ్ మడ్డి వెంకన్న కోరారు. మంగళవారం గట్టిగల్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలతో రెండు జతల నామినేషన్ సెట్లు వేశానని, చెక్ లిస్టు కూడా ఇవ్వకుండా రిటర్నింగ్ అధికారి పత్రాలు స్వీకరించారు. మరుసటి రోజు పరిశీలన పేరుతో ఎలాంటి తప్పులు లేకున్న సమాచారం ఇవ్వకుండా తన నామినేషన్‌ను తిరస్కరించారన్నారు. తాను ఆందోళన చేసినప్పటికీ రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు తనపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ఈ ఉదంతంపై కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌కు ఫిర్యాదు చేయడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో దత్త జయంతి రేపు

తుంగతుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవునిగుట్టతండాలోని సాయిబాబా ఆలయంలో ఈనెల 4వ తేదీన దత్త జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుగులోతు బాలాజీ భారతి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన ఉదయం 5 గంటలకు కాగడ హారతి, బాబాజీ పంచామృతాల అభిషేకాలు, గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీ గణపతి హోమం, దత్తాత్రేయ హోమం, పూర్ణాహుతి, అన్నప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

7న ఉచిత వైద్య శిబిరం

భానుపురి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) సూర్యాపేటలోని వినూత్న ఆసుపత్రిలో ఈనెల 7వ తేదీన నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోషియేషన్) ట్రస్టు చైర్మన్ డాక్టర్ వూర రాంమూర్తియాదవ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ డాంగ్డే కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

జిల్లా అంతటా కోలాహలం

(5వ పేజీ తరువాయి)

స్థానాలకు 1,031 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేటి నుంచి మూడో విడతలో

జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేడి నుంచి ప్రారంభం కానుంది. ఏడు మండలాల పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నారు. అందులో 146 సర్పంచ్, 1,318 వార్డులు ఉన్నాయి. ఇందుకోసం 38 గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. నేటి నుంచి ఈనెల 5వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.

మూడో విడతలోని మండలాలు

మండలం	గ్రామాలు	వార్డు
చింతలపాలెం	16	148
గరిడేపల్లి	33	300
హుజూర్‌నగర్	11	110
మఠంపల్లి	29	254
మేళ్లచెర్వు	16	152
నేరేడుచర్ల	19	168
పాలకవీడు	22	186

మొదటి విడత నేడు నామినేషన్ల ఉపసంహరణ

జిల్లాలో మొదటి విడత ఎన్నికల ప్రాంతాల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటితో ముగుస్తుంది. సాయంత్రం మూడు గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉంది. తర్వాత మిగిలిన వారిని అభ్యర్థులుగా పరిగణించి వారికి ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. 159 గ్రామాలకు సర్పంచ్ అభ్యర్థులుగా 1,132 మంది, 1,441 వార్డులకు 3,646 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

ఆఖరి మజిలీకి అవస్థలే అన్నీ

తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలో చివరి మజిలీకి అవస్థలు తప్పడం లేదు. ఉన్న ఒకే శ్మశానవాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేవు. దీంతో మృతుల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి, తిరుమలగిరి)



తిరుమలగిరిలో శ్మశానవాటిక

శ్మశాన వాటిక ప్రారంభంలో నీటి కోసం బోరు వేసి, కొద్దిదూరం నుంచి కర్రల సాయంతో విద్యుత్ తీగలు లాగి నీటి సౌకర్యం కల్పించారు. ఆ తర్వాత రైతుల పొలాల్లో కిందకు వేలాడటంతో ఆ తీగలను తొలగించారు. శ్మశాన వాటికలో మూడేళ్ల నుంచి ఎలాంటి నీటి సదుపాయం లేదు. . శ్మశాన వాటికలో నీరందించే బోరు మోటారు మరమ్మతుకు గురైనా రెండు నెలల నుంచి మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ సౌకర్యం లేదు. శ్మశాన వాటిక ప్రాంతం మొత్తం గడ్డి, చెట్లు పెరిగి అపరిశుభ్రంగా మారింది. శ్మశాన వాటికకు ప్రహరీ లేనందున స్నానపు గదుల వద్ద నల్లాలు, మహిళలు దుస్తులు మార్చుకునే గది తలుపులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పై కప్పు రేకులు మొత్తం ధ్వంసమయ్యాయి. తలకొరివి పెట్టే సమయంలో కుండెడు నీళ్లు కూడా దొరకడంలేదని మృతుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికలో సదుపాయాలు లేక చాలామంది చెరువులు, కుంటలు, గుట్ట ప్రాంతాల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికలో వసతులు కల్పించాలని స్థానిక కోరుతున్నారు.

మరో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రస్తుతం ఈ శ్మశాన వాటిక పాత గ్రామంలోని 1వ వార్డు దారిలో ఉంది. ఇది క్రాస్ రోడ్డు ప్రాంతాల వారికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. చాలామంది మృతుల కుటుంబ సభ్యులు అంతదూరం వెళ్లలేక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో, గుట్ట వద్ద ఖాళీ ప్రదేశాల్లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ నీటి సౌకర్యం లేనందున, పక్కనే ఉన్న నల్లగుంట చెరువులో స్నానాలు చేస్తున్నారు. అంత్యక్రియలు ఆలస్యమైతే విద్యుత్ సదుపాయం లేక చీకట్లో అవస్థలు పడుతున్నారు. మునిసిపల్ కేంద్రంలోని 3, 4, 7, 13, 14, 15 వార్డుల ప్రజలకు అందుబాటులో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని, అదేవిధంగా మాలిపురం, అనంతారం, నందాపురం గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్మశాన వాటికలో వసతులు కల్పించాలి



క్రాస్ రోడ్డు ప్రాంతాల వారికి అందుబాటులో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న శ్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేనందున, చాలా మంది చెరువుల, కుంటల వద్ద అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. శ్మశాన వాటికలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

- దీన్‌దయాల్, తిరుమలగిరి

సమస్యలు పరిష్కరిస్తాం

శ్మశాన వాటికలో విద్యుత్ సౌకర్యం లేదనందున గతంలో చాలా దూరం నుంచి తీగలు లాగారు. ప్రస్తుతం విద్యుత్ సౌకర్యంలేదు. విద్యుత్ సౌకర్యం కోసం ప్రభుత్వానికి గతంలో అంచనాలు పంపినా నిధులు మంజూరు కాలేదు.విద్యుత్,నీటి సమస్యలను పరిష్కరించడంతోపాటు శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతాం.

- మునావర్ అలీ, మునిసిపల్ కమిషనర్, తిరుమలగిరి

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న సీఎం, మంత్రులు

నేరేడుచర్ల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్‌ను మంత్రులు, ముఖ్యమంత్రి ఉల్లంఘిస్తున్నా ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆరోపించారు. ఈ విషయంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ఎదురు దెబ్బతగులుతుందనే భయంతో రేవంత్‌రెడ్డి జిల్లాల వారిగా ప్రచారం చేస్తున్నారన్నారు. బీసీల ఓట్లతో గెలిచి బీసీలనే మోసం చేశారని ఆరోపించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు ప్రకటించిన అభ్యర్థులను గెలిపించుకోవడానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు అరిబండి సురేష్, దొండపాటి అప్పిరెడ్డి, చెన్నబోయిన సైదులు, చిత్తలూరి సైదులు, లింగయ్య, కెఎల్ఎన్‌రెడ్డి, రాములు, సుదర్శన్, జయబాబు, పిచ్చిరెడ్డి, శ్రీరాంమ్మూర్తి, వెంకన్న, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల పర్వం.. ఎన్నికలకు సన్నద్ధం

చింతలపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం బుధవారం ప్రారంభమైంది. ఈ నెల ఐదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 6న నామినేషన్ల పరిశీలన, 9న ఉపసంహరణకు ఉంటుందని అధికారులు తెలిపారు. చింతలపాలెం మండల వ్యాప్తంగా మూడవ విడతలో ఈ నెల 17న ఎన్నికలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు నాలుగు కస్టర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వై.శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వీవీ రామచంద్‌రావు, తహసీల్దార్ టి.సురేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఎన్.భూపాల్‌రెడ్డి, ఎస్‌ఐ సందీప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● మండలంలో 13 గ్రామాల్లో బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధిర సత్యనారాయణరెడ్డి ప్రకటించారు.

● మఠంపల్లి: మండలంలో 29 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సర్వ సిద్ధం చేసినట్లు ఎంపీడీవో జగదీష్ తెలిపారు. మంగళవారం మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్, ఎన్నికల అధికారులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలి పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అధికారులకు నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగ, ఎస్‌ఐ బాబు, ఎంఈవో వెంకటాచారి, అధికారులు ఉన్నారు.



మఠంపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భారీగా నామినేషన్లు దాఖలు

చివ్వెంల: మండలంలోని 32 గ్రామ పంచాయతీలల్లో రెండో విడతలో స్థానిక ఎన్నికల సందర్భంగా సర్పంచ్, వార్డు సభ్యులకు అభ్యర్థులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారు. చివ్వెంల, చందుపట్ల, గుంజలూరు, మున్యానాయక్‌తండా, వల్లభాపురం, తిరుమలగిరి, వట్టిఖమ్మంపహాడ్, తదితర గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలకుచెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వార్డు సభ్యులకు ఆశావహులు భారీగానే నామినేషన్లు సమర్పించారు.



మోతెలో రాత్రి వేళ నామినేష్ కేంద్రం వద్ద బారులు తీరిన అభ్యర్థులు

ముగిసిన నామినేషన్ల పర్వం

మునగాల రూరల్: మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికకు సంబంధించి మండలంలో ఆరు క్లస్టర్ కేంద్రాల్లో ఆదివారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. నామినేషన్ల పత్రాలను ఈ నెల నాలుగో తేదీన పరిశీలిస్తామని ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ తెలిపారు. మండలంలో ప్రశాతంగా నామినేషన్లు ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా క్లస్టర్ల రిటర్నింగ్ అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్లు

మోతె: మండలంలో 29 గ్రామ పంచాయతీలకు రెండవ విడత నామినేషన్లకు మంగళవారం చివరిరోజు కావడంతో అభ్యర్థులు ఉదయం నుంచి నామినేషన్ కేంద్రాల వద్ద బారులు తీరారు. తహసీల్దార్ కార్యాలయంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందడం ఆలస్యమైనందున నామినేషన్ వేసేందుకు సర్పంచ్, వార్డు సభ్యులు అధిక సంఖ్యలో క్యూలైన్‌లో ఉన్నారు. మండలంలో మొత్తం ఆరు కస్టర్లు ఉండగా, మోతె, ఉర్లుగొండ, సిరికొండ కేంద్రాల వద్ద క్యూ లైన్లు కొనసాగాయి. సాయంత్రం ఐదు గంటల తర్వాత నామినేషన్ వేసే అభ్యర్థులకు అధికారులు టోకెన్లు అందజేశారు. దీంతో రాత్రి 11గంటల వరకు కూడా అభ్యర్థులు క్యూలైన్లలో ఉన్నారు. అర్ధరాత్రి వరకు నామినేషన్ల పర్వం కొనసాగుతుందని ఎంపీడీవో ఆంజనేయులు తెలిపారు.

ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికలను అధికారులు నిబంధనల ప్రకారం నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నీ ఎంపీడీవో హసీం తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన ఎన్నికల పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల నియామావళిలో సూచించిన అన్ని విషయాలను చాలా జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి తప్పులు జరగకుండా ఎన్నికలు సజావుగా జరపాలన్నారు. సమయ పాలన పాటించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ బాక్స్ ను తెరిచే విధానం, సీల్ చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్ సింగ్, టీటీటీలు వై సుభాష్ చంద్రబోస్, జె వెంకటరెడ్డి, వై కృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో హసీం


భగవద్గీత పారాయణంతో సుభిక్షం



కోదాడలో భగవద్గీతను పారాయణం చేస్తున్న మహిళలు

కోదాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవద్గీత పారాయణంతో సమాజం సుభిక్షంగా ఉంటుందని పలువురు మహిళలు అన్నారు. గీతామృతం టీం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో భగవద్గీత పారాయణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ఏకకాలంలో భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేశారు. అనంతరం పలువురు మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో పబ్బా గీత, ఓరుగంటి రమాదేవి, మేళ్లచెర్వు కోటేశ్వరరావు, చంద్రకళ, యాదారాణి, మంజుల, స్వాతి పాల్గొన్నారు.

భగవంతుడి కృప ప్రతీ ఒక్కరిపై ఉండాలి



మద్దిమడుగు బయలుదేరిన హనుమాన్ మాలధారులు

సూర్యాపేటటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భగవంతుడి కృప ప్రతి ఒక్కరిపై ఉండాలని హనుమాన్ మాలధారులు అంగోతు అనిల్‌కుమార్, ధరావత్ సురేష్ స్వామి అన్నారు. మంగళవారం కుడకుడ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయానికి ఇరుముడితో వెళ్లారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సురేష్, బాలు, సుధాకర్, ప్రశాంత్, పాల్గొన్నారు.

నామినేషన్లు పక్రియ పూర్తి చేయాలి

చిలుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల మేరకు మండలంలో నామినేషన్ల పక్రియ పూర్తి చేయాలని ఎన్నికల ప్రత్యేకాధికారి రవినాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు, చిలుకూరు గ్రామాల్లో క్లస్టర్ నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ గుర్తించి తెలియజేసి నామినేషన్ పత్రాలలో తప్పులు లేకుండా చూడాలన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను భద్రపర్చాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీవో నర్సింహారావు తదితరులు ఉన్నారు.

నేత్ర దానం

నేరేడుచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నేరేడుచర్ల పట్టణానికి చెందిన నల్లమిల్లి ఆదిశేషగిరిరావు సతీమణి వనజ మంగళవారం గుండెపోటుతో మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు డైమండ్ నేత్ర నిధికి దానం చేశారు. ఈ కార్యక్రమంలో డైమండ్ నేత్రాలయ చైర్మన్ రమేష్, వాసవి, వనిత క్లబ్ సభ్యులు రాచకొండ శ్రీను, గరిణె జ్యోతి, కొత్త లక్ష్మణ్, నటరాజు, పుల్లయ్య, శ్రీను, అశోక్, రాంమ్మూర్తి, పరమేశం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీఐ

తుంగతుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 11న జరిగే 24 గ్రామ పంచాయతీల ఎన్నికలకు పోలింగ్ కేంద్రా సీఐ నరసింహారావు మంగళవారం పరిశీలించారు. అన్నారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సీఐతో పాటు ఎస్‌ఐ క్రాంతికుమార్ ఉన్నారు.

కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల జాబితా విడుదల

మఠంపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 29 గ్రామాల పంచాయతీలకు కాంగ్రెస్ మద్దతు అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య మంజూనాయక్ మంగళవారం జాబిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు.

బుజ్జగింపులు..బేరసారాలు

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో విజయానికి అవి ఏవిధంగా దోహదపడనున్నాయో వివరిస్తూ పార్టీ మద్దతు తెలిపిన వ్యక్తికి అండగా నిలవాలని చెబుతున్నారు. కొంత మంది మాత్రం బుజ్జగింపులకు సరే అంటునప్పటికీ కొందరు మాత్రం పోటీలో ఉంటామని స్పష్టం చేస్తున్నారు.

మొదటి విడతలో చెల్లుబాటు నామినేషన్లు

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించే 8 మండలాల పరిధిలోని 159 గ్రామపంచాయతీలు, 1,442 వార్డులకు నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. నూతన్‌కల్ మండలం పెదనెమిల గ్రామంలోని ఒకటో వార్డుకు ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. అయితే దాఖలు చేసిన నామినేషన్లను పరిశీలించగా ఎన్నికల కమిషన్ నిబంధనల లేకపోవడంతో తిరస్కరించారు. వివిధ కారణాలతో జిల్లా వ్యాప్తంగా 252 మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించారు. అదేవిధంగా 125 వార్డు మెంబర్ల నామినేషన్లను తిరస్కరించారు. దీంతో ప్రస్తుతం 159 సర్పంచ్ స్థానాలకు 1,132 నామినేషన్లు, 1,442 వార్డులకు 3,646 నామినేషన్లు చెల్లుబాటు అయ్యాయి. నేటి సాయంత్రం మూడు గంటల వరకు ఎవరైనా నామినేషన్‌ను ఉపసంహరించుకుంటే మిగిలిన వారిని పోటీలో ఉన్నట్లుగా అధికారులు ప్రకటిస్తారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చిలుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. అన్నారు. మంగళవారం మండలంలోని బేతవోలు క్లస్టర్ నామినేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అభ్యర్థుల నామినేషన్ పత్రాలను .జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీవో నర్సింహ్మారావులు ఉన్నారు.

మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

చిలుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ అన్నారు. మంగళవారం మండల అనుబంధ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10 కోదాడ పట్టణంలో నిర్వహించే రాజేష్ సంతాప సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మైపంగు హరిబాబు, మేరిగ రామారావు, ఉపేందర్, కృష్ణమూర్తి, శ్రీను, అశోక్, లచ్చయ్య, రాంబాబు, మల్లయ్య, తిరపతయ్య, సిద్దెల రాములు పాల్గొన్నారు.

మండలంలో ముగిసిన నామినేషన్లు

చిలుకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు మండలంలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ పక్రియ మంగళవారం ముగిశాయి. మండల వ్యాప్తంగా 17 గ్రామ పంచాయతీల సర్పంచ్ అభ్యర్థులతో వార్డు సభ్యులు 158 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దార్ ధృవకుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డీఎస్పీని కలిసిన పద్మశాలీ సంఘం నాయకులు

కోదాడటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోదాడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని కోదాడ పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులు మంగళవారం కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కోదాడ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గొర్రె రాజేష్, కార్యదర్శి సంగిశెట్టి గోపాల్, నియోజకవర్గం అధ్యక్షుడు కొంగరి నరసింహారావు, గోలి నాగరాజు, ప్రిండిప్రోలు శ్రీనివాస్, తనంద్, వెంకట్రావు,పంతంగి నరేష్, చెరుకుపల్లి మట్టయ్య, రాఘవయ్య, నక్క గోపి, శేషగిరిరావు పాల్గొన్నారు.

అధికారులు సమర్థంగా పనిచేయాలి

మఠంపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికారులు సమర్థంగా పనిచేయాలని ఎన్నికల అధికారి, మండల తహసీల్దార్ మంగ, ఎంపీడీవో జగదీష్‌లు అన్నారు. మండల కేంద్రంలో పోలింగ్ అధికారులకు ఒక రోజు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలో అనుసరించాల్సిన విధివిధానాలు, ఎన్నికల నియమావళిపై శిక్షకులు అనిల్, అశోక్‌లు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల జిల్లా నూతన కమిటీ ఎన్నిక



రాంబాబు, శ్యాంసుందర్‌రెడ్డి

సూర్యాపేటటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని మంగళవారం ఆసంఘ కార్యాలయ ఆవరణలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బి.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా దండ శ్యాంసుందర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్ఏ హమీద్‌ఖాన్, సహ అధ్యక్షుడిగా కె.రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా విద్యాసాగర్‌రావు, బి.కృష్ణయ్య, ఆర్.నిర్మల, జిల్లా కార్యదర్శులుగా ఎస్.నర్సయ్య, దేవదానం, జాయింట్ సెక్రెటరీగా పద్మారెడ్డి, సుందరయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్.వెంకటేశ్వర్‌రావు, సెక్రెటరీలుగా నర్సయ్య, శోభారాణి, ప్రచార కార్యదర్శిగా గాలి శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లుగా జగన్మోహనరావు, యాదగిరి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ రిటైర్డు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు, వేణు, ఆసంఘ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ ఎంపికపై హర్షం

నూతనకల్: జిల్లా రిటైర్డు ఉద్యోగుల సంఘం ఎన్నిక పట్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మల్లయ్య, ఏ.సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.